ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-12.2025 సమయం: 18.10 గంటలు

ముఖ్యాంశాలు

1. హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న ప్రపంచ సదస్సులో తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ -2047ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కొద్దిసేపట్లో ఆవిష్కరించనున్నారు.

2. పెట్టుబడులే లక్ష్యంగా నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ లో రెండు రోజుల్లో సుమారు 5.4 లక్షల కోట్ల రూపాయల విలువైన పెట్టుబడులకు సంబంధించి వివిధ కంపెనీలతో అవగాహన ఒప్పందాలు కుదిరాయి.

3. రాష్ట్రంలో ప్రతిపక్షాలను అణచివేసే బీఆర్ఎస్ ధోరణిని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అనుసరిస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు.

4. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రెండు రోజుల పాటు చలి గాలులు వీస్తాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

------------------------------

**తెలంగాణా రైజింగ్**

రాష్ట్ర ప్రభుత్వం నిర్లహిస్తున్న తెలంగాణా రైజింగ్ గ్లోబల్ సదస్సు ఈ సాయంత్రం ముగియనుంది. అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్న తెలంగాణా రైజింగ్ విజన్ 2047 డాక్యుమెంటును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మరి కాసేపట్లో లాంఛనంగా ఆవిష్కరించనున్నారు. 2047 నాటికి దేశంలోనే అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా 3 ట్రిలియన్

డాలర్ల ఆర్థిక శక్తిగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చేపట్టే కార్యాచరణను ఈ డాక్యుమెంటులో పొందు పరిచారు.

**MSL**

----------------------------

**పెట్టబడులు**

నిన్నటి నుంచి హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదికగా భారీగా పెట్టుబడులు వస్తున్నట్లు అధికారులు తెలియజేశారు. ఈ రెండు రోజుల్లో సుమారు 5.4 లక్షల కోట్ల రూపాయల విలువైన పెట్టబడులు వచ్చాయి. నిన్న మొదటి రోజు మొత్తం 2.43 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు వివిధ ప్రపంచ స్థాయి సంస్థలతో జరిగాయని వివరించారు. సుమారు 3 లక్షల కోట్ల రూపాయల విలువైన ఒప్పందాలు ప్రభుత్వం చేసుకున్నట్లు వెల్లడించారు.

**జీఎస్**

---------------------

**కిషన్ రెడ్డి**

రాష్ట్రంలో ప్రతిపక్షాలను అణచివేసే ధోరణిలో అధికార పార్టీల వ్యవహారం కొనసాగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు కాంగ్రెస్ అలాగే వ్యవహరిస్తున్నాయని ఎక్స్ లో పోస్టు చేశారు. అర్థరాత్రి బీజేపీ సోషల్ మీడియా బాధ్యులను అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. ఇలాంటి అరెస్టులు తెలంగాణ విశ్వసనీయతను ఎలా పెంచుతాయని కేంద్ర మంత్రి ప్రశ్నించారు.

**జీఎస్**

-----------------------

**మహా లక్ష్మి పథకం**

మహా లక్ష్మి పథకం ద్వారా ఆర్టీసీ లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళలకు రవాణా శాఖ మంత్రి పొన్నం

ప్రభాకర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఇప్పటి వరకు 251 కోట్ల మంది మహిళలు 8 వేల 459 కోట్ల విలువైన మహాలక్ష్మి ప్రయాణాలు చేశారని మంత్రి వెల్లడించారు.

**జీఎస్**

--------------------------------

**తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ**

రాష్ట్రంలోని ఆరు జిల్లాలు మినహా మిగతా అన్ని జిల్లా కేంద్రాల్లోని కలెక్టర్ కార్యాలయాల్లో ఈ రోజు ఉదయం తెలంగాణ తల్లి విగ్రహాలను ఆవిష్కరించారు. హైదరాబాద్ సమీపంలోని ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ వేదికపై నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వర్చువల్ గా ఈ విగ్రహాలను ప్రారంభించారు.

జనగామ జిల్లాలో జరిగిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో అదనపు కలెక్టర్ మాధురి పాల్గొన్నారు.

పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్ లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష పాల్గొన్నారు.

హన్మకొండ కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ పాల్గొన్నారు.

మంచిర్యాల జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ కుమార్ దీపక్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో కిరణ్ కుమార్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అటవీశాఖ అధికారి పద్మజా రాణి పాల్గొన్నారు.

**పీటీసీలు, యాదాద్రి భువనగిరి, నాగర్‌కర్నూల్, ఆసిఫాబాద్, మంచిర్యాల, హన్మకొండ, పెద్దపల్లి, సంగారెడ్డి, జనగామ**

-----------------------

**ములుగు పంచాయతీ ఎన్నికలు**

మొదటి విడత పంచాయతీ ఎన్నికలకు జిల్లాలో ఏర్పాట్లన్ని పూర్తయినట్లు ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ చెప్పారు. పోలింగ్ ఏర్పాట్లను జిల్లా అడిషనల్ కలెక్టర్ సంపత్ రావు తో కలిసి ఆయన పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...

**బైట్ కలెక్టర్ దివాకర**

**పీటీసీ - ములుగు**

------------------------------

**ఎలక్షన్స్**

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు ఈ నెల 11, 14, 17 తేదీల్లో మూడు విడతల్లో జరగనున్న ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం అవసరమైన ఏర్పాట్లు చేస్తోంది. మూడు దశల పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం ఒక కోటి 66లక్షల 48వేల 496 మంది ఓటర్లు అర్హులుగా తేలినట్లు ఎన్నికల సంఘం అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరిలో 81లక్షల 38వేల 937 మంది పురుషులు, 85లక్షల 9వేల 59 మంది మహిళలు, ఇతరులు 500 మంది ఉన్నారు.

**జీఎస్**

---------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో రాబోయే మూడు నాలుగు రోజుల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 4 డిగ్రీలు తక్కువగా నమోదవుతాయని ప్రాంతీయ వాతావరణ కేంద్రం తెలియజేసింది. ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో రెండు రోజుల పాటు చలి గాలు వీస్తాయని ఆ ఆయా జిల్లాలకు పసుపు రంగు హెచ్చరిక జారీ చేసింది.

**పీఎస్**

--------------------------------

**సమ్మిట్ కు పాఠశాలల విద్యార్థులకు అనుమతి**

హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో నిర్వహిస్తున్న తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను రేపు సందర్శించడానికి ప్రత్యేకంగా ఎంపిక చేసిన కొన్ని రెసిడెన్షియల్ పాఠశాలల విద్యార్థులను అనుమతిస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఎల్లుండి నుండి మిగిలిన రోజుల్లో ఎవరెవరికి ప్రవేశం ఉంటుందనే విషయమై రేపు ప్రకటించనున్నట్లు పేర్కొంది.

**జీఎస్**

-------------------------------

**భట్టి విక్రమార్క**

పెట్టుబడులకు ఆవిష్కరణలు తోడైతేనే 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యసాధన సాధ్యమవుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గ్లోబల్ సమ్మిట్ లో ఈ రోజు “3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ కోసం పెట్టుబడులు, ఉత్పాదకత” అంశంపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ... ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే 16 రెట్లు ఆర్థిక వృద్ధిని సాధించాల్సి ఉందని అన్నారు.

**జీఎస్**

---------------------------------

**మంత్రి జూపల్లి**

రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగం కీలకం కానుందని, 2047 నాటికి రాష్ట్ర స్థూల దేశీయోత్పత్తిలో ఈ రంగం వాటాను 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. గ్లోబల్ సమ్మిట్ లో “తెలంగాణ అనుభవాలు – వారసత్వం, సంస్కృతి - ఫ్యూచర్ రెడీ టూరిజం” అనే అంశంపై చర్చలో అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు కీలకోపన్యాసం చేశారు.

**జీఎస్**

-------------------------------

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

ప్రతి కుటుంబం ఉన్నతమైన ప్రమాణాలతో నివసించేందుకు అనువైన సొంత ఇంటి వసతిని కల్పించాలన్నది ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. 'ఎఫోర్టబుల్ హౌసింగ్ పాలసీ ఫర్ అర్బన్ ఫ్యూచర్" అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి కీలక ఉపన్యాసం చేశారు. రాష్ట్రంలో సుమారు మూడున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయని మంత్రి తెలిపారు. వీటితో పాటు హౌసింగ్ బోర్డ్, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ ద్వారా సుమారు లక్ష ఇళ్లు నిర్మించినట్లు వివరించారు.

**జీఎస్**

-----------------------------------

**గ్లోబల్ సమ్మిట్ - వాకిటి శ్రీహరి**

2036 ఒలంపిక్స్ సహా అంతర్జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ క్రీడాకారుల ప్రాతినిధ్యం పెంచే లక్ష్యంగా రాష్ట్రంలో క్రీడా పాలసీని అమలు చేస్తున్నామని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ రెండో రోజు జరిగిన ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సదస్సు లో మంత్రి పాల్గొ ప్రసంగిస్తూ...యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీని కొత్తగా ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ ద్వారా పాఠశాల స్థాయి నుండే క్రీడా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. వెయ్యి ఎకరాల్లో శాటిలైట్ స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

**జీఎస్**

----------------------

**మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

రాష్ట్ర చరిత్రలోనే మొదటిసారిగా రోడ్ సెక్టర్ పాలసీని తీసుకువచ్చామని, ఇది "రైజింగ్ తెలంగాణ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్" కు పునాది అని రోడ్లు భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. “కనెక్టెడ్ తెలంగాణ ఇంటిగ్రేటెడ్ ట్రాన్స్ ఫోర్ట్, అర్బన్ రూరల్ కనెక్టివిటీ” అనే అంశంపై ఆయన గ్లోబల్ సమ్మిట్ లో ప్రసంగిస్తూ... అత్యాధునిక డ్రై పోర్ట్ ను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నామన్నారు.

**జీఎస్**

----------------------

**హరీష్ రావు**

బీఆర్ఎస్ అధ్యక్షులు కె. చంద్రశేఖర్ రావు ఆమరణ దీక్ష ఫలితమే డిసెంబర్ 9 నాటి ప్రత్యేక రాష్ట్ర ప్రకటన అని, ఇది చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదని ఆ పార్టీ శాసన సభ్యుడు హరీష్ రావు అన్నారు. హైదరాబాద్ లోని తెలంగాణ భవన్ లో ఈరోజు జరిగిన విజయ్ దివస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలనలో సంక్షేమం లేకుండా పోయిందని విమర్శించారు.

**జీఎస్**

-------------------

**ఇండిగో**

ఇండిగో విమాన సర్వీసుల సంక్షోభం ఇంకా కొనసాగుతోంది. ఈరోజు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు రావాల్సిన 14, ఇక్కడి నుంచి వెళ్లాల్సిన 44 విమానాలు రద్దయ్యాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. విశాఖ నుంచి బెంగళూరు, హైదరాబాద్‌కు వెళ్లే 6 ఇండిగో సర్వీసులను కూడా రద్దు చేశారు.

**జీఎస్**

---------------------------

**సోనియా గాంధీ జన్మదిన వేడుకలు**

హైదరాబాద్ లోని మంత్రుల నివాస ప్రాంగణంలో కాంగ్రెస్ పార్టీ అగ్రనేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఈ ఉదయం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి తదితరులు కేక్ కోశారు.

**జీఎస్**

---------------------

**మాతా శిశు మరణాల రేటు**

జోగులంబ గద్వాల జిల్లాలో మాతా శిశు మరణాల రేటు తగ్గించేందుకు కృషి చేస్తున్నామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సంధ్యా కిరణ్మయి అన్నారు. ఈ రోజు పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణీల వివరాలను ఆన్ లైన్ లో నమోదు చేయాలన్నారు.

**పీటీసీ - జోగులంబ గద్వాల**

-------------------------------